


# ఏయూ లుక్స్
తెలుగు వార పత్రిక
ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్

ANDHRA UNIVERSITY
Accredited by NAAC With 'A' Grade
ISO 2001:2015 Certified
aulooks@andhrauniversity.edu.in
aulooksvizag2019@gmail.com
ఫోన్: 0891-2844000
July 09-15, 2023

Chief Patron : Prof. P.V.G.D. Prasad Reddy | Chief Editor Prof. K.Samatha | Publisher : Prof. V.Krishna Mohan
సంపుటి : 2 | సంచిక : 74 | పేజీలు : 6




## ముఖ్యమంత్రిని కలిసిన వీసీ ప్రసాదరెడ్డి

**ఏయూ న్యూస్, జూలై :** ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఇటీవల తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఉపకులపతులతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ఆయన్ని కలిసి చిరు ధాన్యాలతో రూపొందించిన సీఎం దంపతుల చిత్రపటాన్ని ఆయనకు బహుకరించారు. ఉన్నత విద్యాభివృద్ధికి, విద్యార్థుల బంగారు భవిష్యత్ అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గతంలో చేసిన సూచనలకు అనుగుణంగా ఆంధ్రవిశ్వవిద్యాలయం

తరువాయి 2 లో

# ఏపీ ఎడ్‌సెట్, పీజీసెట్ ఫలితాలు విడుదల

- వివరాలు వెల్లడించిన వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- ఏపీ ఎడ్ సెట్‌లో 97.08 శాతం ఉత్తీర్ణత
- ఏపీ పీజీ సెట్‌లో 85.29 శాతం ఉత్తీర్ణత




వివరాలు 2లో

## జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

### సెప్టెంబర్ 28, 29 తేదీలలో నిర్వహణ

**ఏయూ న్యూస్, జూలై :** ఆంధ్రవిశ్వదవిద్యాలయం అణుభౌతిక శాస్త్ర విభాగం, నేషనల్ అసోసియేషన్ ఫర్ అప్లికేషన్ ఆఫ్ రేడియో ఐసోటోప్స్ అడ్ రేడియేషన్ ఇన్ ఇండస్ట్రీ (ఎన్ఏఏఆర్ఆర్ఐ–ముంబాయి) సంయుక్తంగా నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో కలసి విశాఖ ఎంపీ ఎం.వి.వి సత్యనారాయణ ఆవిష్కరించారు. సెప్టెంబర్ 28, 29 తేదీలలో ' రీసెంట్ ట్రెండ్స్ ఆన్ అప్లికేషన్స్ ఆఫ్ రేడియో ఐసోటోప్స్ అండ్ రేడియేషన్ టెక్నాలజీస్' ఈ సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. శ్రీనివాసరావు, సదస్సు కన్వీనర్ ఆచార్య ఏ.డి.పి.రావు, డాక్టర్ పి.వి.లక్ష్మీనారాయణ, డాక్టర్ పి.మధుసూధనరావు, డాక్టర్ ఎస్.అప్పన్న బాబు తదితరులు పాల్గొన్నారు.




## ఏయూతో ఇండియన్ నేవీ ఎంఓయూ




### నేవల్ డాక్‌యార్డ్‌లో ఏయూ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

### విద్యార్థుల సాంకేతిక ప్రగతికి చారిత్రక మైలురాయి

**ఏయూ న్యూస్, జూలై :** ఆంధ్ర విశ్వవిద్యాలయంతో భారత నావికాదళం (విశాఖ నావల్ డాక్‌యార్డ్) మధ్య ఇటీవల ఎంఓయూ కుదిరింది. ఇంజినీరింగ్ విద్యార్థుల ఇంటర్న్‌షిప్ శిక్షణలో భాగంగా ఏయూ, ఇండియన్ నావికాదళం అధికారులు ఈ ఎంఓయూ పై సంతకాలు చేశారు. ఆంధ్రా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లోని ఈఈఈ, ఈసీఈ, మెకానికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెరైన్ ఇంజనీరింగ్ మరియు ఆర్కిటెక్చర్ విద్యార్థులకు ఈ ఎంఓయు ద్వారా శిక్షణ అందించనున్నారు. నావల్ డాక్‌యార్డ్ ద్వారా జరుగుతున్న భారత రక్షణ సాంకేతిక ప్రాజెక్టుల అభివృద్ధిలో ఇంటర్న్‌షిప్ శిక్షణ ద్వారా ఏయూ విద్యార్థులు భాగస్వాములు కానున్నారు. ఆరు నెలలు శిక్షణలో ఆయా ప్రాజెక్టుల్లో భాగస్వామ్యంతో పాటు నూతన ఆవిష్కరణలు దిశగా విద్యార్థులు సేవలు అందిస్తారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తులో ఈ ఎంఓయు ఒక చారిత్రక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. వర్సిటీ విద్యార్థులను పారిశ్రామికంగా అనుసంధానిస్తూ నూతన సాంకేతికత దిశగా

తరువాయి 2 లో




# ఏయూతో ఇండియన్ నేవీ ఎంఓయూ

▸▸ మొదటి పేజీ తరువాయి

నడిపిస్తున్నట్లు వీసీ వెల్లడించారు. ఈ ఎంఓయూ ద్వారా మేరిటైం టెక్నాలజీలో విద్యార్థులకు నైపుణ్యం లభిస్తుందన్నారు. వర్సిటీలో అనేక విభాగాల విద్యార్థులు నావల్ డాక్‌యార్డ్ ద్వారా జరిగే పలు నిర్మాణ ప్రాజెక్టుల్లో భాగస్వాములు అవుతారన్నారు. ఇలాంటి మరిన్ని ఎంఓయూల ద్వారా వర్సిటీ విద్యార్థులు సాంకేతిక నైపుణ్య అభివృద్ధికి, ఉద్యోగ కల్పనకు పెద్ద ఎత్తున కృషి జరుగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అడ్మిరల్ సూపరింటెండెంట్ ఆఫ్ నేవల్ డాక్‌యార్డ్ (విశాఖపట్నం) రియర్ అడ్మిరల్ (ఏవీఎస్‌ఎం, ఎన్‌ఎవమ్) సంజయ్ సాధును వీసీ ప్రసారెడ్డి సత్కరించారు. ఆయన వీసీ ప్రసాదరెడ్డికి జ్ఞాపికను అందజేశారు. అనంతరం అడ్మిరల్ సూపరింటెండెంట్ ఆఫ్ నేవల్ డాక్‌యార్డ్ (విశాఖపట్నం) రియర్ అడ్మిరల్ (ఏవీఎస్‌ఎం, ఎన్‌ఎవమ్) సంజయ్ సాధు, ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌లు ఎంఓయుపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో అనూప్ మీనన్, జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్ ), కండోర్ ఆర్. వెంకటేశ్వరన్, అదనపు జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్) కెప్టెన్ సుబ్రతో మండల్, ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య కిషోర్ బాబు, ప్రిన్సిపల్స్ ఆచార్య శశిభూషణరావు, ఆచార్య ఎస్.కె బట్టి, కుమార్ రాజా ప్రాజెక్ట్స్ ఎండి డా. కుమార్ రాజా, సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ డైరెక్టర్ డాక్టర్ ఉజ్వల్ కుమార్ ఘటక్, ఏయూ ఆచార్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# ఏపీ ఎడ్‌సెట్, పీజీసెట్ ఫలితాలు విడుదల



**ఏయూ న్యూస్, జూలై :** రాష్ట్ర వ్యాప్తంగా బిఈడి కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపి ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలతో పాటు పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీపీజీసెట్ ఫలితాలను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి విడుదల చేశారు. ఈ కార్యక్రమం ఇటీవల ఏయూలోని సెనెట్ హాల్ వేదికగా జరిగింది. ఏపి ఎడ్‌సెట్ కన్వీనర్ ఆచార్య కె.రాజేంద్రప్రసాద్, ఏపిపిజిసెట్ ఆచార్య సి.హెచ్.వి.వి.ఎస్ భాస్కరరెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఫలితాల విడుదల అనంతరం వీసీ ప్రసాదరెడ్డి ఆయా వివరాలను మీడియాకు తెలియజేశారు. ఏపి ఎడ్‌సెట్ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 11,236 మంది విద్యార్థులు హాజరు కాగా 10,908 మంది ఉత్తీర్ణత అయినట్లు తెలిపారు. ఈ పరీక్షల్లో 97.08 శాతం మంది ఉత్తీర్ణత నమోదైందన్నారు. మేథమేటిక్స్‌లో 99.63, ఫిజికల్ సైన్స్‌లో 98.66, బయలాజికల్ సైన్స్‌లో 95.41, సోషల్ స్టడీస్‌లో 95.59, ఇంగ్లీషులో 99.58 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు. మేథమేటిక్స్‌లో వై.సాగర్, ఫిజికల్ సైన్స్‌లో ఎం.తిరుపతి నాయుడు, బయాలజీలో ఎల్.ఆస్మా, సోషల్ స్టడీస్‌లో ఎస్.బలరాం నాయుడు, ఇంగ్లీషులో బి.నవీన్‌లు మొదటి ర్యాంకులను సాధించారు. పరీక్షలను పటిష్టంగా నిర్వహించి, సత్వరం ఫలితాలను విడుదలకు కృషి చేసిన కన్వీనర్ ఆచార్య కె.రాజేంద్ర ప్రసాద్‌ను వీసీ అభినందించారు.

## ఏపీపీజీసెట్-2023

అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపిపిజిసెట్ 2023 ప్రవేశ పరీక్ష ఫలితాలను విడుదల చేసిన వీసీ ప్రసాదరెడ్డి ఆ ఫలితాల వివరాలను వెల్లడించారు. పరీక్షకు 26,799 మంది విద్యార్థులు హాజరు కాగా, 22,858 మంది విద్యార్థులు అర్హత సాధించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 37 కేంద్రాలలో ఈ పరీక్షలు నిర్వహించగా 85.29 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. పరీక్షలో బాలురు 85.24, బాలికలు 85.33 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. మొత్తం 21 సబ్జెక్టుల్లో పరీక్షలను నిర్వహించడం జరిగిందన్నారు. పరీక్షలను విజయవంతంగా నిర్వహించి, సత్వరం ఫలితాలకు కృషిచేసిన కన్వీనర్ ఆచార్య సి.హెచ్.వి.వి.ఎస్ భాస్కర రెడ్డిని వీసీ అభినందించారు.

## పీజీసెట్ ర్యాంకర్లు వీరే..

ఇంగ్లీషులో డి.సుధాకర్ రావు, తెలుగులో కె.నవ్య, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లో వై.రిషిత,హిస్టరీలో జి.భార్గవి, పొలిటికల్ సైన్స్‌లో ఎం.రాహుల్, ఎకనామిక్స్‌లో బి.ప్రసాద్, కామర్స్‌లో జె.సూర్య సాయి చరణ్, ఎడ్యుకేషన్‌లో బి.రామకృష్ణ, లైఫ్ సైన్స్‌లో పి.రేణుక, ఫుడ్ అండ్ న్యూట్రిషనల్ సైన్స్‌లో కె.వైష్ణవి,బోటనీలో వి.వరుణ్, సెరీకల్చర్‌లో జి.వెన్నెల, జువాలజీలో పి.ఆర్ గాయత్రి, మేథమేటిక్స్‌లో వై.సాగర్, స్టాటస్టిక్స్‌లో టి.ప్రద్యున్,ఫిజికల్ సైన్స్‌లో షేక్ రోషన్, ఎలక్ట్రానిక్స్‌లో ఎస్.బాలమని, కెమికల్ సైన్స్‌లో టి.రాజ శేఖర్, జియాలజీలో డి.జ్యోష్నవి,సైకాలజీలో పి.లక్ష్మి సౌజన్య, కంప్యూటర్ సైన్స్‌లో టి.సురేష్ కుమార్‌లు మొదటి ర్యాంకులను సాధించారు.



# ముఖ్యమంత్రిని కలిసిన వీసీ ప్రసాదరెడ్డి

▸▸ మొదటి పేజీ తరువాయి

సాధిస్తున్న ప్రగతిని సమావేశం వేదికగా వీసీ వివరించారు. విద్యార్థుల ఇండస్ట్రీయల్ కనెక్టవిటీకి వీలుగా 20 వరకు ఇండస్ట్రీయల్ ఛైర్స్ ఏర్పాటు, ఆహబ్ ద్వారా ఆవిష్కరణలు దిశగా విద్యార్థులకు అందిస్తున్న ప్రోత్సాహం, పార్మా, డ్రోన్ టెక్నాలజీ ఆవిష్కరణల దిశగా జరుగుతున్న పరిశోధనలు, మిషన్ లెర్నింగ్‌లో విద్యార్థులకు అందిస్తున్న సహకారంపై ముఖ్యమంత్రికి సవివరంగా వివరించినట్లు ఆచార్య ప్రసాదరెడ్డి వెల్లడించారు. చదువు పూర్తయ్యే నాటికి ఉద్యోగంతోనో, ఉద్యోగాల కల్పన సామర్థ్యంతోను విద్యార్థి క్యాంపస్ విడిచి వెళ్లాలంటూ గతంలో సీఎం ఇచ్చిన పిలుపుకు అనుగుణంగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో వందశాతం క్యాంపస్ ప్లెస్‌మెంట్స్ సాధించినట్లు వీసీ వెల్లడించారు. దీంతో పాటు గత మూడేళ్లుగా సైన్స్, ఆర్ట్స్, న్యాయ కళాశాల పరిధిలో విద్యార్థులకు సైతం రికార్డు స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు సీఎంకు వివరించారు. ఏయూలో ఏర్పాటు చేసిన మెరైన్ సెంటర్ ప్రగతిని సీఎం ప్రస్తావించగా వీసీ ప్రసాదరెడ్డి అక్కడ జరుగుతున్న పరిశోధనాత్మక అభివృద్ధిని, విద్యార్థులకు అందిస్తున్న శిక్షణ, ఉద్యోగ అవకాశాలను వివరించారు.

## గంట..పదినిమిషాలు దిశానిర్దేశం

ఉన్నత విద్యా ప్రగతికి తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుదీర్ఘంగా వివరించినట్లు వీసీ ప్రసాదరెడ్డి తెలిపారు. ప్రధానంగా సిలబస్ రీడిజైన్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజన్స్, మిషన్ లెర్నింగ్ అంశాలపై సీఎం జగన్ దిశానిర్దేశం చేసినట్లు వీసీ వివరించారు. త్వరలో డ్రోన్ టెక్నాలజీ ద్వారా వ్యవసాయ రంగంలో సాధించనున్న అభివృద్ధిని వీసీలకు తెలియజేశారన్నారు. డ్రోన్స్ సాంకేతికతతో రాష్ట్రంలోని ప్రతి రైతు పైనా, ప్రతి ఎకరా భూమిపైనా ప్రత్యేక దృష్టిసారించే విషయాన్ని సీఎం జగన్ వివరించినట్లు తెలిపారు. డ్రోన్ టెక్నాలజీ ద్వారా ప్రతి ఎకరాలో మట్టి నాణ్యత, మినరల్స్‌ను పరిశీలించడంతో పాటు ఆయా సమాచారం ద్వారా ఎలాంటి పంటలు పండిస్తే మంచి ఫలితాలు వస్తాయి అనేదానిపై దృష్టిపెట్టనున్నట్లు తెలిపారన్నారు. ప్రస్తుతం ఇజ్రాయిల్ వంటి దేశాలు ఇలాంటి సాంకేతికతతోనే వ్యవసాయంలో అద్భుతాలు సృష్టిస్తున్నాయంటూ సీఎం వివరించినట్లు తెలిపారు. అనంతరం రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల వీసీలు చేసిన సూచనలను సీఎం స్వీకరించినట్లు తెలిపారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజన్స్ టెక్నాలజీ ప్రతి రంగంలోను అందుబాటులోకి వచ్చే దిశగా విశ్వవిద్యాలయాల వీసీలు కృషిచేయాలని సీఎం జగన్ సూచించినట్లు వీసీ ప్రసాదరెడ్డి వెల్లడించారు.



చాలా మందిలా నేను డిగ్రీలో సాధారణ విద్యార్థినే. తెలుగు మీడియం బ్యాగ్రౌండ్‌తో గ్రామ స్థాయి నుంచి పీజీకి వచ్చి ఇంగ్లీస్ చదువుతో ఇబ్బందులు ఎదుర్కొన్న వాడినే. అయితే నాలోని తపన, ఆచార్యులు అందించిన ప్రోత్సాహం నున్న ఎన్నడు చదువులో వెనుకడుగు వేయనీయ లేదు. నీ లక్ష్య సాధనలో లాంగ్వేజ్ నీకు ఎప్పుడు అడ్డంకి కాలేదంటూ ఆచార్యులు చెప్పిన మాటలు నన్ను వెన్నుతట్టి ప్రోత్సహించాయి. అందుకే గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చినప్పటికీ నా ప్రస్థానం యూఎస్‌ఏ వరకు సాగిందంటారు దుగ్గిరాల నాగ వినోద్. ఆంధ్రవిశ్వ విద్యాలయం అలుమ్ని అయిన ఆయన ప్రస్తుతం అమెరికాలోని ఆస్టీన్ (టెక్సాస్)లో వీసా ఇన్‌కార్పోరేట్ సంస్థలో చీఫ్ సెక్యురిటీ ఆర్కిటెక్‌గా విధులు నిర్వరిస్తున్నారు. ఇటీవల ఇండియాకి వచ్చినప్పుడు ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని సందర్శించడంతో పాటు తన గురువర్యులైన వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తన ఉన్నత విద్యాభ్యాసం నాటి జ్ఞాపకాలను, వృత్తి రిత్యా సాధించిన అనుభవాలను ఏయూ లుక్స్‌తో పంచుకున్నారు. ఆయా వివరాలు ఆయని మాటల్లోనే.

- ఏయూ న్యూస్, జులై

## వేలమంది ఏయూ విద్యార్థులు యూఎస్‌లో ఉన్నతంగా ఉన్నారు

## వీసీ ప్రసాదరెడ్డి సార్ మార్గనిర్ధేశమే నా ఉన్నతికి బాటలు వేసింది

## సైబర్ భద్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

### ఏయూ లుక్స్ ఇంటర్వ్యూలో... ఏయూ అలుమ్ని, ఎన్ఆర్ఐ దుగ్గిరాల నాగవినోద్








# యూఎస్‌లోను ఏయూకు బ్రాండ్ ఇమేజ్



### నా ప్రస్థానం సాగిందిలా...

మాది అనకాపల్లి జిల్లా చోడవరం. నా ప్రాథమిక విద్యాభ్యసంతో పాటు బీఎస్సీ కూడా చోడవరం ప్రభుత్వ కళాశాలలోనే పూర్తి చేశాను. అనంతరం 95- 98 మధ్య ఎంసీఏ చేయడానికి నగరానికి రావడం జరిగింది. ఏయూ అనుబంధ కళాశాల అయిన పైడా కళాశాలలో చేరాను. అక్కడే నా కేరీర్‌కు మంచి పునాదులు పడ్డాయి. 1999లోనే సైబర్ సెక్యురిటీ వైపు నా ప్రయాణం సాగింది. ప్రస్తుతం ఆ రంగంలో ఉన్నత పరిజ్ఞానం కలిగిన వ్యక్తుల్లో ఒకడిగా నిలిచాను. ఇప్పటికే పలు దేశాలకు చెందిన ప్రముఖ కంపనీల్లో విధులు నిర్వర్తించాను. సైబర్ సెక్యురిటీలో 25 ఏళ్ల సుదీర్గ అనుభవం సాధించాను. ఇదంతా మా తల్లిదండ్రులు, ఆచార్యులు అందించిన పరిజ్ఞానం, ప్రోత్సాహంతోనే సాధ్యమైంది. విశాఖ ఎప్పుడు వచ్చినా నా ఉన్నతిలో అత్యంత క్రియాశీలక పాత్ర పోషించిన గురువర్యులను కలుస్తుంటాను. ఇందులో భాగంగానే ఇటీవల ఆంధ్రవిశ్వవిద్యాలయం వీసీ, మా గురువర్యులు ఆచార్య ప్రసాదరెడ్డి సార్‌ను కలవడం జరిగింది.

### ఈ రంగాన్ని ఫ్యాషన్‌గా భావించా...

ఆ రోజుల్లో సైబర్ సెక్యురిటీకి ఇంతటి ప్రాధాన్యం లభిస్తుందనే ఆలోచన నాకు లేదు. అయితే నేను దాన్ని ఫ్యాషన్‌గా భావించి ఈ రంగంలోకి ప్రవేశించాను. ఈ సెక్టార్‌లో ఉద్యోగం చేసేందుకు ఇష్టపడ్డాను. దానికి కారణంగా సైబర్ సెక్యురిటీ కూడా రియల్ పోలిసింగ్ మాదిరిగా సమాజానికి భద్రత కలిగించే అంశాలనికి సంబంధించినది కావడమే. ప్రస్తుతం ఏఏ రంగాల్లో ఎంత సాంకేతికత పెరిగినా ప్రతి సాంకేతికతకు సైబర్ సెక్యురిటీ తప్పనిసరి అయ్యింది. ఏఐ. ఐఓటీ, ఆటోమేషన్ ఇలా సాంకేతికత ఏదైనా దాన్ని హాకర్స్ చేతుల్లోకి వెళ్లకుండా భద్రత కల్పించాల్సిందే. ప్రస్తుతం ఇలాంటి విధులనే నేను నిర్వర్తిస్తున్నాను. యూఎస్ఏకు చెందిన వీసా ఇన్ కార్పోరేట్ సంస్థకు చీఫ్ సెక్యురిటీ ఆర్కిటెక్ట్ గా వ్యవహారిస్తున్నాను. 1999లోనే సైబర్ సెక్యురిటీ రంగంలోకి అడుగుపెట్టిన నేను వెనుదిరిగి చూడలేదు. తొలుతా విజవల్స్ ఆఫ్ టెక్నాలజీ సాఫ్ట్‌వేర్ డవలప్‌మెంట్ సైబర్ సెక్యురిటీ వింగ్‌లో ఉద్యోగంతో నా ప్రస్థానం ప్రారంభించాను. అనంతరం హువావి టెక్నాలజీస్ (చైనీస్ కంపినీ), ప్రపంచంలోనే టాప్‌మోస్ట్ గ్లోబల్ సైబర్ సెక్యురిటీ అయిన ఆర్ఎస్ఏలోను, విప్రోటెక్‌లోను ఉన్నతాధికారిగా సైబర్ సెక్యురిటీ విభాగాలకు సేవలందించాను. అనంతరం యూఎస్ బెస్ట్ బై రిటైల్ కంపనీలో సీనియర్ సెక్యురిటీ ఆర్కిటెక్‌గా విధులు నిర్వరించాను. ప్రస్తుతం 2014 నుంచి వీసా ఇన్ కార్పోరేట్‌కు చీఫ్ సెక్యురిటీ ఆర్కిటెక్ట్‌గా వ్యవహారిస్తున్నాను. ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. 98 ఏళ్ల సుదీర్గ చరిత్ర కలిగిన ఏయూ విద్యార్థులు లక్షల మంది విదేశాల్లో స్థిరపడ్డారు. ఒక్క ఆమెరికాలోనే 40 వేల మందికి పైగా ఆంధ్రయూనివర్సిటీ అలుమ్ని విద్యార్థులు ఉన్నారు. వివిధ సంస్థల్లో ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారు. అక్కడ కూడా ఏయూకు చాలా మంచి బ్రేండ్ ఇమేజ్ ఉంది. ఇక్కడ చదివి వెళ్లిన విద్యార్థులకు అక్కడి సంస్థలు ప్రత్యేక ప్రాధాన్యమిస్తు న్నాయి. పరస్పర సహకారం, అక్కడ కంపనీల్లో ఉద్యోగ అవకాశాలు, ఎక్స్‌పోజర్, గ్లోబల్ ప్రోగ్రామింగ్‌లో ఏయూ అలుమ్ని విద్యార్థులు అక్కడ సహయ సహకారాలు సైతం అందిపుచ్చు కుంటున్నారు. ప్రస్తుతం అమెరికా విశ్వవిద్యాల యాలు, కంపనీలతో బందాలను మరింత పెంచేందుకు మరిన్ని ఎంఓయూ జరుగుతున్నట్లు వీసీ ప్రసారెడ్డి వివరించారు. ఇది విద్యార్థులకు మరింత కలిసొచ్చే అంశం. ఈ ఎంఓయూల్లో భాగంగా యూఎస్ వర్సిటీలలో మాస్టర్స్ చేసే అవకాశం మన విద్యార్థులకు లభిస్తుంది. నేరుగా యూఎస్‌లో మాస్టర్స్ చేయాలంటే ఒక విద్యార్థికి రూ.60 నుంచి రూ.70 లక్షలు ఖర్చవుతుంది. అయితే ఏయూ కుదుర్చుకున్న ఎంఓయూ ద్వారా రూ.10 లక్షలకే ఇక్కడ విద్యార్థులు యూఎస్‌లో మాస్టర్ డిగ్రీని పూర్తి చేసే అవకాశం వుంది. నిజంగా ఇది రాష్ట్ర విద్యార్థులకు గోల్డెన్ ఆపర్టునిటి.

### అంతా తెలుసనే భావన వద్దు..

నేడు సైబర్ క్రైం పాత్ర సమాజంలో భారిగా విస్తరిస్తోంది. మనం సెల్ ఫోన్‌లో రోజు వారిగా చేసే కార్యకాలాపా ల్లోనూ సైబర్ నేరాలు జరిగేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. అందుకే సాంకేతికతను ఉపయోగించి చేసే ప్రతి పనిలోను జాగ్రత్తలు పాటించాల్సిన అవసరముంది. ఎవరిలోను అంతా నాకు తెలుసనే భావన ఉండకూడదు. మోబైల్ అయినా , కంప్యూటరైనా మనకు వచ్చే సందేశాలను క్షణంగా పరిశీలించి ఓపెన్ చేయడం మంచిది. సాంకేతికత విషయంలో అప్రమత్తంగా లేకుంటే అనుకోని అనర్థాలను ఎదుర్కొవాల్సివస్తుందనే విషయాన్ని అందరు గమనించాలి.

## వీసీ సార్ మార్గనిర్ధేశమే మలుపు తిప్పింది

తెలుగు మీడియం నేపథ్యంతో పీజీలో చేరే విద్యార్థులు ఇంగ్లీష్ లాంగ్వేజ్‌లో ఎదుర్కొనే పరీక్షల్లో పాస్ మార్కులు సాధిస్తే ఆరోజుల్లో గొప్ప. నాదీ దాదాపు అలాంటి పరిస్థితే. ఎంసీఏలో చేరాక నాకు ఒక 6 నెలల పాటు ఏమీ అర్థం కాలేదు. ఆచార్యులు ఇంగ్లీష్‌లో భోదించే పాఠాలు బొర్రకెక్కేవి కావు. దీంతో తీవ్ర ఒత్తిడికి గురయ్యేవాణ్ని. ఎంసీఏ మానేద్దమంటే తల్లిదండ్రులు కష్టపడి నాకోసం చెల్లించిన ఫీజు రూ.14వేల వృథా అవుతుందనే భయం. ఎందుకంటే ఆరోజుల్లో అది చాలా పెద్ద మొత్తం. ఇలాంటి పరిస్థితుల్లో ఆచార్య ప్రసాదరెడ్డి సార్‌ని నేను కలవడం జరిగింది. ఆ రోజుల్లో నాలాంటి ఎంతోమంది విద్యార్థులకు మెంటర్‌గా ఉంటూ విద్యార్థి దశలో ఉన్నత లక్ష్యాలపై దిశానిర్ధేశం, సబ్జెక్టు నైపుణ్యంపై శిక్షణ అందించేవారాయన. ఈ నేపథ్యంలో ఆయన్ని కలిసి నా సమస్యను ఆయనకు వివరించాను. దీంతో ప్రసాదరెడ్డి సార్ నన్ను ప్రోత్సహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. నాకు టైపింగ్‌లో హైస్పీడ్ అనుభవం ఉండటంతో నా సబ్జెక్టు బుక్‌లోని పాఠ్యాంశాలను, థియరీలను ఉన్నది ఉన్నట్లుగా ఇంగ్లీష్‌లో టైప్ చేస్తూ ఎగ్జిక్యూట్ చేయమని చెప్పారు. పూర్తిగా ఎగ్జికూట్ చేసిన తరువాత వాటి మధ్యలో కొన్ని లైన్స్ తొలగించి లోపాల్ని క్షుణ్నంగా పరిశీలించమన్నారు. ఈ విధానం ద్వారా ఆయా థియరీలు, పాఠ్యాంశాలల్లో సబ్జెక్ట్సపై పట్టు లభిస్తుందని చెప్పారు. తద్వారా సబ్జెక్ట్ సామర్థ్యంతో పాటు ఇంగ్లీష్‌పై పరిజ్ఞానం లభిస్తుందని సూచించారు. దీంతో నేను ఆ విధానాన్ని పూర్తిస్థాయిలో అనుసరించడంతో కొద్దిరోజుల్లోనే అటు సబ్జెక్టుపైనా ఇటు ఇంగ్లీష్‌పైనా పరిజ్ఞానం పెంచుకోగలిగాను. ఆరోజు ఆయని మార్గనిర్ధేశమే నా అభ్యోన్నతికి బాటలు వేసిందని నేటికి నేను భావిస్తాను.

# మంచినీటి శుద్ధి కేంద్రం ప్రారంభం

## ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్ కృష్ణమోహన్





**ఏయూ న్యూస్, జూలై :** ఆంధ్రవిశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల హాస్టల్స్ దరి పున:నిర్మించిన మంచినీటి శుద్ధి కేంద్రాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ ప్రారంభించారు. విద్యార్థులకు ఉపయుక్తంగా శుద్ధమైన త్రాగునీరు అందించే విధంగా పరికరాలను విద్యార్థు లకు అందుబాటులోనికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మరమ్మత్తులు జరుగుతున్న హాస్టల్ భవనాలను రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ ప్రత్యక్షంగా పరిశీలించారు. పనుల ప్రగతిని చీఫ్ ఇంజనీర్‌ను అడగి తెలుసుకున్నారు. పనుల నాణ్యతను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ ఆచార్య కె.రమేష్‌బాబు, ఏయూ చీఫ్ ఇంజనీర్ ఆర్.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

## పేపర్ బ్యాగ్‌లను ప్రోత్సహించాలి



**ఏయూ న్యూస్, జూలై :** పేపర్ బ్యాగ్‌ల వినియోగాన్ని ప్రోత్సహించాలని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.వి.వి సత్యనారాయణ అన్నారు. ప్రపంచ పేపర్ బ్యాగ్ డేని పురస్కరించుకుని ఏయూ వీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పర్యావరణహితంగా నడచుకోవాలని సూచించారు. విద్యార్థులను భాగస్వాములను చేస్తూ ఇటువంటి కార్యక్రమాలను నిర్వ హించడం మంచి పరిణామమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పేపర్ బ్యాగ్‌లను ప్రదర్శించారు. కళాత్మకంగా విద్యార్థులు వీటిని తీర్చి దిద్దిన విధానాన్ని ఎం.పీ అభినందించారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి మాట్లాడుతూ రీసైక్లింగ్ చేయడానికి ఉపయుక్తంగా ఉండే కాగితం సంచులను వినియోగించాలనే సందేశాన్ని యువతతో సమాజంలోనికి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఏ.నరసింహా రావు, టి.శోభశ్రీ, విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, డాక్టర్ నాగరాజ కుమారి, బోధన సిబ్బంది, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## బైలింగ్వల్ పుస్తకం

# ఆవిష్కరించిన వీసీ




**ఏయూ న్యూస్, జూలై :** డిగ్రీ విద్యార్థులకు అద్భుతమైన విద్యనందించడంలో భాగంగా ఉన్నత విద్యామండలి సులభతరమైన ఆంగ్లంలో పుస్తకాలను అందుబాటులోకి తెస్తోంది. గత కొంతకాలంగా ప్రక్రియ జరుగుతుండగా పెద్ద ఎత్తున పుస్తకానులను ఉన్నత విద్యామండలి అందుబాటులోకి తెస్తోంది. సులభతరమైన ఇంగ్లీస్‌తో పాటు తెలుగులోను ఈ పుస్తకాలు అందుబాటులకి వస్తున్నాయి. ఇందులో భాగంగా ద్వితీయ సంవత్సరం బీకాం విద్యార్థులకు సంబంధించిన వస్తు మరియు సేవల పన్ను (GST), బైలింగ్విల్ పాఠ్యపుస్తకాన్ని, ఆంధ్ర విశ్వవిద్యాలయం అకడమిక్ డీన్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు ఎడిటర్‌గా, డాక్టర్ గుడిపాటి శ్రీనివాసరావు, (డాక్టర్ వి ఎస్ కృష్ణ కళాశాల వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు) డాక్టర్ జి.అరుణ్ కుమార్, (డాక్టర్ వి.ఎస్ కృష్ణ కళాశాల అధ్యాపకులు) డాక్టర్ కి శ్రీనివాసరావు, డాక్టర్ ఎం శ్యాంబాబు, హెచ్ ఎస్ ఎన్ వి ఎస్ పవన్ కుమార్‌లతో కూడిన అధ్యాపక బృందం రూపొందించింది. ఈ నేపధ్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి ఇటీవల తన ఛాంబర్‌లో ఈ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ బైలింగ్వల్ పుస్తకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థి దశలో సబ్జెక్టుపై పట్టు సాధించడం ద్వారా భవిష్యత్‌లో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా అధ్యాపక బృందానికి వీసీ అభినందనలు తెలియజేశారు.

## పరీక్ష కేంద్రాలు పరిశీలించిన

# రెక్టార్, రిజిస్ట్రార్





**ఏయూ న్యూస్, జూలై :** ఆంధ్రవిశ్వవిద్యాలయంలో పీహెచ్‌డి కోర్సుల్లో ప్రవేశాలు పొందిన పరిశోధకులకు నిర్వహించే ప్రీపీహెచ్‌డి పరీక్షలు ఇటీవల నిర్వహించారు. ఏయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, ఏయూ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఏయూ కాలేజ్ ఇంజనీరింగ్, కాలేజ్ ఆఫ్ ఫార్మశీ లోని పలు విభాగాల పరిశోధక విద్యార్థులకు ప్రీ పీహెచ్‌డి పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలు జరుగతున్న వివిధ కేంద్రాలను ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహణ జరపడం పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్ట్స్ కళాశాలలో 99, సైన్స్ కళాశాలలో 72, ఇంజనీరింగ్‌లో 73, ఫార్మశీలో 12 మంది పరిధోకులు ఈ పరీక్షకు హాజరయ్యారు. మొత్తం 256 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ ఆచార్య డి.వి.ఆర్ మూర్తి తెలిపారు.

## విద్యతో పాటు ఉన్నత విలువల బోధనే ఉపాధ్యయుల లక్ష్యం కావాలి



**ఏయూ న్యూస్, జూలై :** విద్యార్థులకు ఉన్నత విద్యతో పాటు ఉన్నత విలువలు బోధించడమే ఉపాధ్యయుల ప్రధాన లక్ష్యం కావాలని ఐ.ఏ.ఎస్.ఇ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం మానవ వనరుల అభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేసిన ప్యాకల్టీ ఇండక్షన్ ప్రోగ్రాంను ఐ.ఏ.ఎస్.ఇ ప్రిన్సిపాల్ ఆచార్య.టి.శోభశ్రీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య శోభశ్రీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విద్యావిధానంలో ఎన్నో వినూత్న మార్పులు తీసుకువచ్చాయన్నారు. యుజి మరియు పిజి సిలబస్‌లో అకాడమిక్ కెరియర్ కు సంభందించి కొత్త కర్యులం రూపొందించడం జరిగిందన్నారు. ఈ నూతన విద్యావిధానం ను అనుసరిచి అధ్యాపకులు మరిన్ని నైపుణ్యాలను సంపాదించి విద్యార్థులకు ఉత్తమమైన విద్యను బోధించే విధంగా ఈ శిక్షణ ఉపయోగపదుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మానవ వనరుల అభివృద్ధి కేంద్రం డైరెక్టర్ ఆచార్య టి.వెంకటకృష్ణ మట్లాడుతూ ఉపాధ్యాయులంతా నిరంతర విద్యార్థులన్న విషయాన్ని గుర్తించాలన్నారు. 28 రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమంలో రాష్టం నలుమూలల నుంచి వివిధ డిగ్రీ కళాశాలల అద్యాపకుల హాజరయ్యారన్నారు. వివిధ అంశాల్లో నిష్ణాతులైన వారిచే శిక్షణను అందించడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ క్రమశిక్షణతో విద్యాబోధనలో మెలుకువలు అభ్యసించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా ఆచార్య ఎన్.ఏ.డి. పాల్ వ్యవహరించి ప్రసంగించారు.

## ఈ వారం డాక్టరేట్లు

### అస్మారేకు మేనేజ్ మెంట్‌లో డాక్టరేట్



**ఏయూ న్యూస్, జూలై :** ఆంధ్రవిశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, కామర్స్ మేనేజ్ మెంట్ లో పరిశోధన చేసిన దిసెన్ దిబెబ్ అస్మరేకు ఏయూ పిహెచ్‌డి అవార్డు లభించింది. ఈసందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి ఛాంబర్‌లో అస్మరేకు పిహెచ్‌డి ప్రొసీడిఇఁగ్ వైస్ ఛాన్సలర్ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి అందించి అభినందనలు తెలిపారు. అలాగే కామర్స్ మేనేజ్ మెంట్ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అస్మరేకు శుభాకాంక్షలు తెలియజేసారు.

### సైకాలజీలో సలోమికి డాక్టరేట్



**ఏయూన్యూస్,జూలై:**ఆంధ్రవిశ్వ విద్యాలయం కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజి సైకాలజీ విభాగంలో పరిశోధన చేసిన ఎం సలోమికి ఏయూ డాక్టరేట్ లభించింది. ఈసందర్భం గా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి ఆయన ఛాంబర్‌లో సలోమికి పిహెచ్‌డి అవార్డుకు సంబందించిన ప్రొసీడింగ్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి సలోమికి అందించారు. ఈసందర్భంగా ఏయూ డిపార్ట్ మెంట్ ఆఫ్ సైకాలజీ విభాగం ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు సలోమికి శుభాకాంక్షలు తెలిపారు.

## వాతావరణ మార్పులపై జర్నలిస్టులకు అవగాహన సదస్సు

**ఏయూ న్యూస్, జూలై :** ఆంధ్రా యూనివర్శిటీ అమెరికన్ కార్నర్. హైదరాబాద్ కాన్సులేట్ జనరల్ ఎంపవరింగ్ పీపుల్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన "జర్నలిస్ట్‌ల కోసం వాతావరణ మార్పుల వర్క్‌షాప్" శనివారం అమెరికన్ కార్నర్ లో ముగిసింది. వాతావరణ మార్పు వరదలు, గ్లోబల్ వార్మింగ్,తీవ్రమైన కరువు, వేడి తరంగాలు, అడవి మంటలకు దోహదం చేస్తున్నందున దానిని నిశ్శబ్ద విపత్తుగా పరిగణించవచ్చని వక్తలు పేర్కొన్నారు. జర్నలిజం ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి మాట్లాడుతూ అత్యవసర చర్యలకు ప్రజల మద్దతును పెంచడానికి మానవ కారణాలను వివరించడం ద్వారా వాతావరణ మార్పులను తగ్గించడంలో పాత్రికేయులు ప్రధాన పాత్ర పోషిస్తారని అన్నారు. ఓషనోగ్రఫీ డాక్టర్ ఓఎస్ఆర్‌యూ భానుకుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులే ప్రధాన వాటాదారులని, వారు సుస్థిరత, పర్యావరణ పరిరక్షణ గురించి తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. పునరుత్పాదక ఇంధన వనరులలో పెట్టుబడులు పెట్టడం మరియు అడవుల పెంపకం వాతావరణాన్ని రక్షించడానికి ప్రధాన సాధనాలు, వీటిని తక్షణమే ప్రజలకు పంపిణీ చేయాలి. గ్రీన్ హౌస్ వాయువుల పెరుగుదలతో వార్షిక ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగి హిమానీనదాలు కరిగిపోవడానికి దారితీసింది, ఇది ప్రమాదకర స్థాయిలో సముద్ర మట్టాలు పెరగడానికి ప్రధాన కారణం. బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ చల్లా రామకృష్ణ మాట్లాడుతూ వాతావరణ మార్పుల ప్రమాదకర ప్రభావాలను అరికట్టడంలో జర్నలిస్టులు ఉత్తమమైన పరిష్కారాలను తెలియజేయవచ్చు. వాతావరణ మార్పులను నివేదించడంలో జర్నలిస్టులు మరియు విద్యార్థులలో వర్క్‌షాప్ నైపుణ్యాన్ని పెంచిందని ఫ్యూస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సెల్విన్ భీమారావు అన్నారు. డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్, ఆదిత్య పవన్ కుమార్, ఆదినారాయణ, రామచంద్రరావు, బి శివరామకృష్ణ తదితరులు ప్రశంగించారు.



## కృష్ణా యూనివర్శిటి వీసీగా ఆచార్య జ్ఞానమణి నియామకం



**ఏయూ న్యూస్, జూలై :** ఆంధ్రవిశ్వ విద్యాలయం పూర్వ ఆచార్యులు కె. జ్ఞానమణి కృష్ణా యూనివర్శిటి వైస్ ఛాన్సలర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు విడుదల చేసింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం జువాలజీ ఆచార్యుడైన ఆచార్య జ్ఞానమణి ఏయూలో పలు పదవులను సమర్ధవంతంగా నిర్వహించారు. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా , వర్సిటీ అకాడమిక్ అఫైర్స్ డీన్‌గా, విభాగ బీఏఎస్ ఛైర్మన్‌గా, విభాగాధిపతిగా బాధ్యతలను నిర్వర్తించారు. ఆచార్యుడిగా జువాలజీ విభాగ ప్రగతికి క్రీయాశీలక పాత్ర పోషించారు. ఎంతో సమర్ధత కల్గిన ఆచార్యునిగా వర్సిటీలో గుర్తింపు తెచ్చుకున్నారు. చేపట్టిన ప్రతి పదవిని సమర్ధవంతంగా నిర్వహించారు. ఈ నేపధ్యంలో కృష్ణా యూనివర్సిటీ వీసీగా ఆయన నియమితులు కావడంపై వర్సిటీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా పలువురు వర్సిటీ ఆచార్యులు, పరిశోధకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

# తెలుగు భాష వికాసానికి దిక్సూచి కొమర్రాజు




**ఏయూన్యూస్, జులై :** ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు భాష,సాహిత్య,చరిత్ర పరిశోధనా పితామహుడు శ్రీ కొమర్రాజు వేంకట లక్ష్మణ రావు శత వర్ధంతి కార్యక్రమం ఏయూ తెలుగు విభాగంలో నిర్వహించారు. ముందుగా కొమర్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి గా విచ్చేసిన కొమర్రాజు వెంకట లక్ష్మణ రావు మనవడు ఆంధ్ర విశ్వకళాపరిషత్ రాజనీతి శాస్త్ర విశ్రాంతాచార్యులు ఆచార్య కొమర్రాజు రవి మాట్లాడుతూ కొమర్రాజు భాష, సాహిత్య, చరిత్ర పరిశోధనలకే పరిమితం కాలేదని సంఘ సంస్కరణ దృక్పథం తో మహిళల విద్య కోసం పాటు పడ్డారన్నారు. తన సోదరి చదువుకే కాక ఆనాటి సమాజం లో మహిళల లందరూ చదువుకొని సమాజశ్రేయస్సుకు పాటుపడాలని ఆకాంక్షించారన్నారు. బడుగు, బలహీన అట్టడుగు వర్గాల ప్రజల తరుపున రచనలకు పూను కున్నారన్నారు. మహిళల కోసం,వితంతు పునర్వివాహాల కోసం, దళితుల అభ్యున్నతి కోసం నిరంతరం కృషిచేసిన మహహానుభావుడని తెలిపారు. దక్షణ భారతదేశంలో ప్రధాన వక్తగా విచ్చేసిన ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ తెలుగు సాంస్కృతిక పునర్జీవనంలో కొమర్రాజు పాత్ర చాలా గొప్పదని, తెలుగు భాషపై, సాహిత్యంపై, పరిశోధనపై చెరగని ముద్రవేసారని, చరిత్రగర్భంలో చిరస్థాయిగా నిలిచి ఉన్నారని ఆయన ఒక వ్యక్తిగా గాక సమూహ శక్తిగా వ్యవస్థగా నిలబడ్డారన్నారు. ఆచార్య జి యోహాన్ బాబు మాట్లాడుతూ సంఘసంస్కర్తల బాటలో నడిచి సమాజ ఉద్ధరణకు పూనుకున్న మహామనీషి కొమర్రాజని ప్రశంసించారు. కందుకూరి, రఘుపతి వెంకటరత్నం నాయుడు, గోపాలకృష్ణగోఖలే, బాలగంగాధర్ తిలక్ ,బిపిన్ చంద్రపాల్, గురజాడ అప్పారావు వంటి సంఘసంస్కరణ, సాంస్కృతిక పునర్జీవ వికాసానికి దోహదపడిన వారెందరినో స్ఫూర్తి గా తీసుకొని సమాజాభివృద్ధికి పాటుపడ్డ కొమర్రాజును ఆదర్శంగా తీసుకొని ఎందరో శిష్యులు ఆయన ఆశయాలను వారసత్వ సంపదకు జాతికి అందించారని అటువంటి శిష్యులను పొందిన కొమర్రాజు జీవితం మనందరికీ మార్గదర్శనమన్నారు. ఈ కార్యక్రమం లో తెలుగు ఆచార్యులు అన్నంశెట్టి ఈశ్వరమ్మ, డాక్టర్ బూసి వెంకటస్వామి,డా కట్టెపోగు రత్నశేఖర్,డాక్టర్ పెండ్యాల లావణ్య, ఆతుకూరి వెంకటేశ్వర్లు డాక్టర్ యల్ గిరీష్ కుమార్, గోవిందు, స్వామి తదితర పరిశోధక విద్యార్థులు, బోధనేతర సిబ్బంది,వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు, డాక్టర్ ఎం. సుబ్బారావు,డాక్టర్ అడపా రామకృష్ణ, మేళం మస్తాన్ రెడ్డి, ఆచార్య అనురాధా తదితరులు పాల్గొన్నారు.

# డిఫెన్స్ స్టడీస్‌లో పీఆర్‌సీ కోర్సు ప్రారంభం

## వీసీకి రక్షణ రంగ ఉద్యోగులు అభినందన



**ఏయూన్యూస్, జులై :** ఆంధ్రవిశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్‌లో డిప్లొమా ఇన్ సేఫ్టీ- డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రీ రిలీజ్ కోర్సును ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి ప్రారంభించారు. అనంతరం వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ దేశ రక్షణ రంగంలో పనిచేస్తున్న సైనికోద్యోగులకు ఉపయుక్తంగా కోర్సులను నిర్వహించడం ఏయూకు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిలుస్తోందన్నారు. త్వరలో ఏయూలో స్కూల్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సైనికోద్యోగులు, విశ్రాంత సైనికోద్యోగులు, శాస్త్రవేత్తలు, దేశ రక్షణ రంగలో అడుగిడాలని భావించే యువతను భాగస్వాములను చేస్తూ సదస్సులు, విద్యా సంబంధ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కోర్సును రక్షణ రంగలో పనిచేస్తున్న సిబ్బందికోసం నిర్వహిస్తున్నారు. కోర్సులో ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌కు చెందిన 30 మంది ఉద్యోగులు హాజరయ్యారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ సంచాలకులు ఆచార్య కె.నిరంజన్, అడ్జంక్ట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉజ్వల్ కుమార్ ఘటక్, యూనివర్సిటీ ఇంజనీర్ ఆర్.శంకర రావు, భౌతిక శాస్త్ర విభాగాధిపతి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా డాక్టర్ కె.ఎల్.రావు జయంతి

**ఏయూన్యూస్, జులై :** డిపార్ట్‌మెంట్ ఆఫ్ సివిల్ ఇంజినీరింగ్, ఆంధ్రా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ పద్మభూషణ్ డాక్టర్ కె.ఎల్ రావు 121వ జయంతి వేడుకలను ఘనంగా సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో నిర్వహించారు. డాక్టర్ కె ఎల్ రావు సివిల్ ఇంజనీర్ నీటిపారుదల, విద్యుత్ పార్లమెంటుకు కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఆయనను భారతదేశ నీటి నిర్వహణ , వ్యవసాయ పితామహుడు అంటారు. ఈ సందర్భంగా సివిల్ ఇంజినీరింగ్ విభాగం హెచ్ఓడీ ఆచార్య సత్యనారాయణరెడ్డి డాక్టర్ కెఎల్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి, అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులను ఉద్దేశించి ప్రసంగించారు. కేంద్ర నీటిపారుదల శాఖ మంత్రిగా డాక్టర్ కె.ఎల్.రావు సాధించిన విజయాలను, నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు చేసిన సహకారాన్ని ఆయన ఎత్తిచూపారు. నాగార్జున సాగర్ డ్యాం, భాక్రా డ్యాం రూపకల్పన నిర్మాణంలో డాక్టర్ కెఎల్ రావు కృషిని ప్రొఫెసర్ సత్యనారాయణ రెడ్డి ప్రశంసించారు. డాక్టర్ కె ఎల్ రావు "స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ రీన్‌ఫోర్స్ కాంక్రీట్" పై ఒక పుస్తకాన్ని రచించారన్నారు. 1957-61, 1961-65 మధ్యకాలంలో ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ సాయిల్ మెకానిక్స్ అండ్ జియోటెక్నికల్ ఇంజనీరింగ్ (ఆసియా) వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేశారు. అతను 1958-60 మధ్యకాలంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ అధ్యక్షుడిగా పనిచేశాడు. నీటిపారుదల ప్రాజెక్టులకు ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా గుంటూరు జిల్లా పులిచింతల ప్రాజెక్టుకు కేఎల్ రావు సాగర్ ప్రాజెక్టుగా నామకరణం చేశారు. ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన గర్వించదగిన ప్రఖ్యాత భారతీయ ఇంజనీర్ డాక్టర్ కెఎల్ రావు గా వెల్లడించారు. జీవిత శైలి విజయాల నుండి విద్యార్థులు స్ఫూర్తి పొందాలని ప్రొఫెసర్ సత్యనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. సివిల్ ఇంజినీరింగ్ అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని డాక్టర్ కెఎల్ రావుకు నివాళులర్పించారు. సంస్మరణ వేడుకల కార్యక్రమాన్ని ప్రొఫెసర్ వై.అబ్బులు అధ్యక్షత వహించారు. ప్రొఫెసర్ పీవీవీ సత్యనారాయణ, ప్రొఫెసర్ వజీర్ మహ్మద్, ప్రొఫెసర్ కె. శ్రీనివాసరావు, ప్రొఫెసర్ ఎస్ ఆదిశేషు, ప్రొఫెసర్ ఐ శివపార్వతి, ప్రొఫెసర్ మునిరెడ్డి, డాక్టర్ టీ ఉషా మాధురి, డాక్టర్ కే రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



Chief Patron Prof. P.V.G.D. Prasada Reddy, Chief Editor Prof K.Samatha,Publisher Prof V. Krishna Mohan, Chief Advisor Prof James Stephen, Technical Adviser D.Sivakumar Reddy, Editorial Team Dr. Challa Rama Krishna, Prof. D.Lalitha Bhaskari, Dr. T.Vijaya Lakshmi, Mr. V.V.S.V Narasimham, Dr. Ch. Satyanarayana, Andhra University South Campus, Visakhapatnam, Andhra Pradesh, India, Pin: 530 003, Phone : 0891-284422